

# ఓట్ల విత్తనాలు

"ఆకు కూరలమ్మా...ఆకు కూర కట్టలు. పాలకూర, చుక్కకూర, కలెగూర, గంగవాయిల కూర, కల్జామాకు, కొత్తిమీరా..." బ్రహ్మపుత్రానదీ ప్రవాహంలా మణెమ్మ గొంతు సవ్వడి వీధి వారందరికీ వినబడింది. అదే స్వర ఝరి నన్ను నిద్రాదేవి ఒడిలోంచి లాగింది. ఆవులిస్తూ లేచి కూచున్నాను. ఆపసోపాలు పడుతూ మంచందిగాను. ఈ కూరలమ్మే మణెమ్మను సృష్టించేప్పుడు బ్రహ్మదేవుడు పరాకుగా నోరు కొంచెం పెంచి పెట్టాడేమో! రోజూ గొంతు చించుకుని అరిచినా బొంగురు పోవటంలేదు.... బుర్రలో మొలకెత్తుతున్న ఆలోచనను పక్కకు నెట్టి రోజువారీ కాలకృత్యాల్లోకి దిగాను. పేస్టు, బ్రష్‌తో బయటికొచ్చేసరికి మా శ్రీమతికి కావాల్సిన కూర కట్టలిచ్చి మారుమాటాడకుండా గంప నెత్తుకుని వెళ్లిపోతోంది.

మావిడోసారి పిల్లల్తో సహా పుట్టింటికెగిరిపోయింది. నాకేమో... ఒక్క రోజు హొటల్‌లో తిండి తింటే నాల్రోజులు నలతగా ఉంటుంది. కాబట్టి స్వయంపాకమే శరణ్యమైంది. ఓ ఆదివారం...అనుకోకుండా ఆ రోజు మణెమ్మ ఎప్పటికంటే ముందొచ్చింది. ఆశ్చర్యంతో కారణమడిగాను. రోజూ బయటి అరుగుమీదనే గంప దింపుకునేది ఆ రోజు నేరుగా ఇంట్లోకొచ్చి దింపుకుంది. "మా ఆటో ఆయనేదో ఊరికి పోతాడట. ఇయ్యాల మా ఊరి నుండి ముందుగ బయల్దేరుతనని నిన్ననే చెప్పిండు" ముక్కుపుడక తళుకుల్లో ముచ్చటచెబుతూ గంప పక్కన కూర్చుంది. నాక్కావల్సిన కూరలు కొంటుంటే సందేహాలకు రెక్కలొచ్చినై. "రోజూ గింత పొద్దున ఏ ఊరు నుంచి వస్తున్నావమ్మా?" తో ప్రారంభించి మాటల ముగ్గులోకి దింపాను.

"నేనూ సారూ!" గంప పక్కన గోడకారిగి కూచుంది. ఆయాసాన్ని ఆపుకుని "చౌడారం నుంచి ఆటోల పావు గంట తొవ్వ. మా ఊరి పాలోల్లు, కూరగాయలోల్లకోసము రోజూ

తెల్లారకముందే ఆటో వస్తుంది. దాంట్ల పాలక్యాన్లు, కూరగంపలతో వస్తం. అదే ఆటో ఈ ఊరి గాంధీ బొమ్మకాన్నుంచి తొమ్మిది గంటలకు చౌదారం బయల్దేరుతుంది..." నేను ఆసక్తిగా వింటూంటే ఆవిడ మొహం అరవిందములా విచ్చుకుంది. నా ఉత్సాహం రెట్టింపైంది. "నీ భర్త ఏంజేస్తడు? నీకు పిల్లలెందరూ? వంటా వార్పు ఎప్పుడు?" వివరాలన్నీ అడిగి ఊపిరి పీల్చుకున్నాను. "వంటదేముంది సారూ! ఇంటికాడ మబ్బులనే చాయ దాగుతం, ఇక్కణ్నుంచి ఇంటికి పోంగనే నాస్త తయారుజేస్త. నా పెనిమిటీ, నేను తింటం. ఆయన డ్యూటీకి పోతడు. మా ఊరి బడిల ఆయన అటెండర్. ఇంక నేను వంటపని మీదుంట. మజ్జాన్నం రాంగనే ఇద్దరం కలిసి అన్నం తింటం. ఆయన డ్యూటీకి పోతడు. నేను కూరల తోటలు తిరిగి కూరలు దెచ్చుకుంట. కట్టలు గట్టి తయారుచేసుకుంట. ఏదో సారూ! చెరో కష్టం చేస్తున్నంగాని నా పెనిమిటి కష్టమంతా కాకులు, గద్దలకేసినట్టే ఐపోతుంది."

"ఏం... ఎందుకూ?" "అదో ముచ్చట వేరే ఉంది సారూ! ఇప్పుడెందుకులే!" "మరి....పిల్లలో?" "పిల్లలా?" గంపను దగ్గరకు లాక్కుని వెళ్ళేందుకు తయారవుతుంది. ఒక్కడే కొడుకు. వానికి చదువు అంటలేదు. పెండ్లయింది. వానికిద్దరు పిల్లలు. కోడలు గయ్యాలి ముండ. ఇక్కడ వానల్లేక కూలి పని దొరక దాయె. అందుకే బొంబాయి పొయ్యి కూలి పంజేస్తున్నాడు. కోడలేమో పిల్లల్తోని అవ్వగారింటుంటుంది. పైసలు దానికే పంపిస్తడు. అదింట్ల ఉంటే దానికి, నాకు పొయ్యిల ఉప్పు పోసుకున్నట్టే చిట్టర పట్టరలు" గంప ఎత్తుకుని గడప దాటింది. ఆకాశ సూర్యుణ్ని అలవోకగా చూస్తూ గబగబా వెళ్లిపోయింది. అయ్యో పాపం! రెక్కాడితే గాని డొక్కాడదన్న మాట! అసలీ ప్రపంచంలో ఏ సమస్య లేని మనుషు లెవరున్నారు? ప్రశ్నకు జవాబు వెతుక్కుంటూ వంటింట్లో చొరబడ్డాను.

ఓ గంటలో కాలకృత్యాలు ముగించుకున్నాను. వెళ్ళేముందు శ్రీమతి తయారుచేసుంచిన అటుకుల చుడువా డబ్బా ఆపద్బాంధవునిలా కనబడింది. కిస్తీలో కొన్ని కుమ్మరించుకుని చెంచా అందుకున్నాను. నేరుగా వెళ్లి టివి ముందు కూచున్నాను. వార్తలు చూస్తూ టిఫిన్ కానిచ్చాను. అలవాటు ప్రకారం చాయ్ కోసం అత్మారాముని ఆరాటం. చాయ్ కాచుకోవడమంటే అదో ప్రహసనములా కన్పిస్తుంది. రోజూ ఆఫీసుకెళ్లగానే దునియా కబుర్లు రంగరించి కాంటీన్‌లో చాయ్ తాగడమలవాటు. కాని ఆదివారం గదా... తప్పదు... వంటింట్లోకెళ్లి గ్యాసు స్టౌ వెలిగించాను. గిన్నెలో నీళ్లు పోసి పొయ్యి మీద పెట్టాను. చాయ్ పొడి డబ్బా కోసం కాస్సేపు వెతికాను. దొరకలేదు. విసుగొచ్చింది. ఛీ ఛీ... ఎందుకీ అవస్త? హొటల్ తిండి పడదు గాని వేడి వేడి చాయ్‌కేమిటటా! బుర్రలో

బల్బు వెలిగింది. స్టౌ ఆర్పేశాను. చాయ్ గోల నదిమిపెడుతూ డ్రెస్సు వేసుకుని బయట పడ్డాను. ఏ హొటల్లో దూరాలా...అని ఆలోచిస్తూ నడుస్తున్నాను. సెల్‌ఫోన్ రింగయింది. రోడ్డు ప్రక్కకెళ్లి ఓ ఇంటిముందాగాను. "హలో సార్! నేను రవీందర్‌ను" అతడు నా కో వర్కరు. సబార్డినేటు అన్నమాటేగాని ఆత్మీయ మిత్రుడు. "హలో రవీ! చెప్పు. ఏంటి విశేషాలు?" కళ్లను అటూ ఇటూ తిప్పాను. అరె... అది రవీందర్ ఇల్లే.

"విశేషాలు సశేషమేగానీ మీరిప్పుడెక్కడున్నారు?". "ప్రస్తుతం మీ ఇంటి ముందున్నాను" "అలాగా!" అంటూ అరుగుమీదికొచ్చాడు. "రండిసార్!" స్వాగతించాడు. టైం పది దాటింది. వెంటనే చాయ్‌తో గొంతు తడపాలని ఆత్మారాముడు అల్లరి చేస్తున్నాడు. కాస్సేపు తటపటాయించాను. రవీందర్ నా ముందు కొచ్చి చెయ్యందుకున్నాడు. "మా ఇంట్లోకొచ్చేందుకు అనుమానమా సార్?" లాక్కెళ్లాడు. కుర్చీలనాక్రమించి పిచ్చాపాటీలో పడిపోయాం. పైకి ఏదో మాట్లాడ్తున్నాను గాని నా నరాలు చాయాస్వరనాదాలు వినిపిస్తున్నాయి. బయటపడేందుకు సాకు వెతుక్కుంటున్నాను. "బాగున్నారా అన్నయ్యా?" అనురాగ స్వరంతో అరుంధతి చాయ్ కప్పులతో ప్రవేశించింది. ఆమె రవీందర్ అర్థాంగి. ట్రేను టీపాయ్‌మీదుంచి తానూ కూచుంది. వెదకబోయిన తీగ వేలికి దగినట్టు ప్రాణంలేచొచ్చింది. అరక్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా పొగలు కక్కుతున్న చాయ్ కప్పందుకున్నాను. "వదినా, పిల్లలు బాగున్నారా అన్నయా?" "ఆ! ఆ... మీ వదిన పిల్లల్తో సహా పుట్టింటికెళ్లిందమ్మా". "అట్లానా... ఏదన్నా ఫంక్షనా?". "వారం క్రితం వాళ్లన్నయ్య కొడుకు అమెరికా నుండి వచ్చాడటా. రాగానే పెళ్లి ముహూర్తం...".

'వారం రోజుల్లో పెళ్లిచూపులు, నిశ్చితార్థం అన్నీ ఐపోయినయా?" ముక్కుపుడక మెరుపుల్లో కాటుక కళ్లను కమ్మగా తిప్పుతూంటే ఆదిశంకరాచార్య అమ్మవారిని వర్ణించిన సౌందర్యలహరి మనసులో మెదిలింది. "అవునమ్మా! పెళ్లిచూపులు ఇంటర్‌నెట్లోనటా. వాడొచ్చిన రోజునే నిశ్చితార్థమైందంటా. ఇంకో మూడు రోజుల్లో మూడు ముళ్లెయ్యడమే..." కుటుంబ విషయాలు దొర్లిపోతున్నాయి. తననో శ్రోతగా మార్చేసి మేము ముచ్చట్లలో మునిగినందుకేమో రవీందర్లో అసహనం పేరుకుపోయినట్టుంది. ఖాళీ కప్పు టీపాయ్ కప్పగిస్తూ "ముచ్చట సంబరాన మొగుణ్ని మరిచినట్టు ఇదేమిటీ?" ప్రశ్నాబాణం వదిలాడు. అరుంధతి కనురెప్పలు టపటపలాడినై "అయ్యో! తమరిని నేనెప్పుడు మరిచానటా! మాతో పాటు చాయ్ లాగించిండ్రుగదా!". "అబ్బా! అది కాదు అరుందా!". "మరింకేమిటటా?" కనుబొమ్మలు ప్రశ్నార్థకాలైనాయి. "అయ్యో! నేను సామెత చెప్పినానంతే. అసలు సంగతేమిటంటే మేమిప్పుడు చౌడారం గ్రామం వెళ్లాలి. అందుకోసమే తయారై వచ్చిన

మనిషిని మాటల్లోకి దింపితే ఎట్లా అరుందా?". అరెరే! ఈ రోజు సాయంత్రం మా కొలీగ్ కూతురు పెళ్లికి చౌడారం వెళ్లాలిగదూ! ముందుగా వెళ్లి కొలీగ్‌కు పెళ్లి పనుల్లో సాయపడాలనుకున్నాం... అప్పుడే ఆన్ చేసిన కంప్యూటర్లా బుర్రలో బల్బు వెలిగింది. "నిజమేనమ్మా! ఇప్పుడు గుర్తుకొచ్చింది. నేనందుకోసం తయారై రాలేదు గానీ... ఇహ తప్పదిప్పుడు...". "మరైతే ఇంటికెళ్లొస్తారా?" రవీందర్ లేచి నుంచున్నాడు. "ఊహు! మనిద్దరం తమరి స్ప్లెండర్ బండిమీద బయలుదేరి మా ఇంటి ద్వారా చౌడారం వెల్దాం. ఇక్కణ్నుంచి ఓ పావు గంట తోవనటా!" లోపల ఏమనుకున్నాడో గాని పైకి సంతోషంగా తలూపాడు.

+

పట్టణం పరిధి దాటగానే స్లెండర్ బండి జెట్ విమానమైంది. నేను వెనక కూచుండి ప్రకృతి పరవశింపుల్ని మనసారా అనుభవిస్తున్నాను. రోడ్డు పక్క భూముల్లో తంగేడుపూలు, పచ్చని పొలాలు, చెట్ల రెమ్మలు తలలూపుతూ వీడ్కోలు చెబుతున్నాయి. రోడ్డుమీద భూతల విమానాల్లా పరుగెడుతున్న ఆటోలను చూపిస్తూ రవీందర్ "చూసారా సార్! ప్రతి ఊళ్ళో ఆటోలు, పేకాటలు మామూలైపోయినై. ముగ్గురు మాత్రమే కూచోవాల్సిన ఆ ఆటోలో పదికిపైగా కూచున్నారు. అదసలు మనుషుల ఆటోనా లేక గూడ్స్ ఆటోనా! ఏ మాత్రం స్లిప్ అయినా వాళ్లంతా పై లోకాల తలుపులు తట్టాలె గదా!" అంటూ మెల్లిగా బండి గేరు మార్చి వేగం తగ్గిస్తూ మలుపు తిప్పాడు. "అదంతే రవీ! ఎన్ని ప్రమాదాలు జరిగినా ఎవ్వరన్నా భయపడుతున్నారా? నెల నెలా ఆఫీసర్లకు మామూళ్లు ముడుతున్నై గదా! ఆటోవాలాల ఇష్టారాజ్యమైందనుకో". "నిజమే సార్! రాను రాను మన దేశంలో ప్రజాస్వామ్యం పిచ్చికుక్కలాగై పోతుంది" అంటూ స్ప్లెండర్‌ను పెళ్లి ఇంటి ముందాపాడు. పెళ్లికూతురు తండ్రి అంటే మా కొలీగ్ ఎదురొచ్చి మహదానందంగా స్వాగతం పలికాడు. ఇంటి ముందు పెళ్లి పందిరి రెడీగా ఉంది. "నాదో అనుమానం మిత్రమా!" రవీందరడిగాడు కొలీగ్‌ను.

"అందరూ పట్టణాల్లో మ్యారేజి హాలు బుక్ చేసుకుని పెళ్లిళ్లు చేస్తుంటే మీరు ఇంటిముందు చేస్తున్నారెందుకూ?". "పెళ్లికొడుకుది ఈ ఊరే సార్. మాకు సౌకర్యమే" అంటూ చేతులు పట్టుకుని భోజనశాలకు తీసుకెళ్లాడు. పిండి వంటలు, స్వీట్సుతో సుష్టుగా భోంచేశాము. ఇల్లంతా హడావుడిగా ఉంది. "మేమేం చెయ్యాలిప్పుడు?" రవీందరడిగాడు మా కొలీగ్‌ను. "పెళ్లిపనుల్లో సాయపడాలని ముందొచ్చాము" నేనన్నాను. "థ్యాంక్యూ సార్! ఈ రోజుల్లో ఎవ్రీథింగ్ ఈజ్ మేడీజీ. నాదస్వర బృందము, వంటల వల్లభులు,

టెంట్ హౌజ్ సామానులు, పందిళ్లు వేసేవాళ్లు... ఇవన్నీ పట్నం నుండే దిగుమతాయె. ఎవరి పనులు వారు చకచకా చేసుకుపోతున్నారు. మా ఇంటివాళ్లం అతిథి మర్యాదలు పర్యవేక్షిస్తున్నాం" అంటూ తీసుకెళ్లి పక్కింట్లో వదిలేశాడు.

ఇల్లు పెద్దదే. ప్రాకారాలు, ఆకారం వెనకటివైనా ఆధునిక హంగులు పులిమారు. మూడు బ్యాచులు తివాచీల టీవీ దాని మానాన అది నడుస్తూనే ఉంది. ఎవరిలోకంలో వాళ్లున్నారు. అందులో మాకు తెలిసిన వారున్నారు. "రండి సార్! ఓ చెయ్యి వెయ్యండి" ఒకాయన పేకాటకు ఆహ్వానించాడు. "సారీ సర్! మాకు ఆట తెలీదు" అన్నాను. పేకాట గాళ్లంతా మమ్మల్ని వింత జంతువుల్లా చూశారు. వాళ్ల దృష్టిలో మాకు నాగరికత తెలియదు. ఒక్కొక్కరు ఒక్కోరకంగా విరిసిన నవ్వుల్ని ఏరుకుంటూ టీవీ కెదురుగా కూచున్నాము. అలాగే నడుంవాల్చాము. కమ్మని పెళ్లి వంటకాలు కడుపులో చెమ్మాచెక్కాలాడుకుంటూ నిద్రాదేవి ఒడిలోకి లాక్కెళ్లాయి. "లేవండి. అందరూ లేవండి. పెళ్లి... పెళ్లి" ఒకాయన మా భుజాలు పట్టి లేపాడు. లేచి కూచుని టైం చూశాము. ఆరు దాటింది. పేకాట రాయుళ్లెవ్వరూలేరు.

"పేకాట వాళ్లేరీ?" ఆశ్చర్యంగా అడిగాను. "వాళ్ళంతా ఎదురింట్ల దావతులున్నరు. మీరు వెళ్లండి". "దావతా! ఈ టైంలోనా?" "అవున్సార్! ఇది అదే టైంగదా! అక్కడ బీరు, విస్కీ, కోడికూర, పూరీలు... అన్నీ ఉన్నాయి సార్!" గర్వంగా తలపైకెత్తాడు. దావతు అర్థం, పరమార్థం అర్థమైంది. "అవన్నీ మా కాబోయే సర్పంచ్ పంపిండు సార్!" నవ్వాడతడు. "అవునవును పంచాయితీ ఎన్నికలు దగ్గర పడినైగదా!" రవీందర్. అతని మార్గదర్శనంలో వెళ్లి ముఖాలు కడుక్కుని ఫ్రెష్ అయిపోయాం. మందు పసందుకు మేమిద్దరమూ దూరమే. బయట చీకటి పరదాలు ఆకాశం నుండి దిగజారుతున్నాయి. "పెళ్లికింకా టైముంది. కూరాళ్లు నింపుడు, భాసింగాల పూజ... అవన్నీ కావాలె గదా! అప్పటి దాకా ఏం చేద్దాం రవీ?" మంగళవాద్యాలు వింటూ అడిగాను. మనమట్లా ఊరు తిరిగొద్దాం సార్!" రవీందర్ బయలుదేరాడు. నేను వెంబడించాను. అలుముకున్న చీకట్లను ఛిన్నాభిన్నం చేస్తూ వీధిలైట్లు వెలిగాయి. రోడ్డుమీద నడుస్తున్నాను. పల్లె జన జీవనాన్ని పరకాయిస్తూ ఊరు బయటికొచ్చాము. రోడ్డు ప్రక్కన పశువుల దొడ్డి. దాని ముందున్న రోడ్ కల్వర్టు గోడ మీద కూచున్నాము. నిండా కుక్కిన మనుషులతో ఓ ఆటోనిండు చూలాలులా ఊళ్ళోకెళ్లింది. దాని తర్వాత ఆర్టీసి బస్సు. బస్సు ఊళ్లోకెళ్ళేప్పుడు అందులో ఇరవై మంది దాకా కన్పించారు. తిరిగి వెళ్ళేప్పుడు ఇద్దరే ఉన్నారు.

"ఈ ఆటోల పటాటోప మేమో కాని ఊరూరికి బస్సు సౌకర్యాన్ని ఘోరంగా దెబ్బతీస్తున్నాయి సార్!" రవీందర్ ప్రస్తావించాడు. "ఈ స్పీడు యుగంలో కూడా సమయపాలన లోపించడం, ప్రయాణీకులను ఎదిరి చూపుల్లో ముంచెత్తడం ఆర్టీసి బస్సుల ఆనవాయితీ గదా! ఎప్పుడంటే అప్పుడు ఆటోలు రెడీగా ఉంటాయి కాబట్టి వాటినే ఆశ్రయిస్తారు జనాలు...". కబుర్లు కట్టిపెట్టి కల్వర్టుకు టాటా చెప్పాము. ఊరు ముందు బెంచీలమీద ఎవరెవరో సరదాగా ముచ్చట్లాడుతూ సారా పాకెట్లు విప్పి సేవిస్తున్నారు. వేయించిన ప్యాలాలు నంజుకుంటున్నారు. "అటు చూడండి సార్! అది చాయ్ హొటలా సారా షాపా?" రవీందర్ విస్తుపోయాడు. పత్రికల్లో వార్తలు చూస్తున్నాంగదా ఊరూరా సారాయి ప్రవహిస్తుందని. మహిళలు దానికి వ్యతిరేకంగా ఉద్యమాలు కూడా చేస్తున్నారు కదా! అంతెందుకూ, మన పట్నంలో షాపు లైసెన్సుతోని బార్లు నడుస్తున్నాయి గదా! ఇక్కడిదో పద్ధతి".

"సారా అమ్మాలంటే లైసెన్సు కావాలి గదా!". "ఓట్ల రాజకీయములో చట్టాలు కొందరికి చుట్టాలైపోయినై. ఇక్కడ వీళ్లను లైసెన్సు అడిగే వారెవ్వరూ?". "ఓహొ! బెల్టు షాపులంటే ఇవేనన్నమాటా?". "అవును...ఇవే రవీ!". మరికొంత ముందుకెళ్లాం. ఏదో గుర్తుకొచ్చినట్లుగా రవీందర్ నెత్తి గోక్కున్నాడు. "సార్! నోరంతా ఎట్లానో ఉంది. వక్కపొడి కొనుక్కుందాం పదండి" రోడ్డుకు కుడి పక్క సందులోనున్న కిరాణా షాపును కళ్లతో చూపించాడు. "సరే! చెరో పొట్లాం వక్కపొడి నములుత్తూ పెల్లిలో కూచుందాం". రోడ్డుకు వంద గజాల దూరంలో  ఉందా కిరణాషాపు. దాని ముందు జనాలు మూగి ఉన్నారు. బయట రెండు వైపులా బెంచీ లేసున్నాయి. వాటిమీద పూల రెక్కల చుట్టూ తేనెటీగల్లా మనుషులున్నారు. సారా పాకెట్లు విప్పి ప్లాస్టిక్ గ్లాసుల్లో పోసుకుని తాగేస్తున్నారు. మనసులు విప్పి మాట్లాడుకుంటున్నారు. షాపుకెదురుగా నున్న వీధి లైట్లు వెలుతురు వారి ఉత్సాహానికి ఊతమిస్తోంది. కుడివైపు బెంచీ మీద ఇద్దరు ఏదో విషయమ్మీద లొల్లి పెట్టుకుంటున్నారు.

మేమిద్దరం కిరాణా షాపు మెట్లు ఎక్కి నుంచున్నాము. గిరాకిదార్లంతా సారా పాకెట్లు కొంటున్నారు. రవీందర్ చొరవగా "రెండు వొక్కపొడి పొట్లాలివ్వండి" రెండ్రూపాయలు చూపించాడు. "కొంచెమాగాలి సార్. పొట్లాల గిరాకి తర్వాత వక్కపొడి" నిర్మొహమాటంగా చెప్పాడు షాపు యజమాని. ఐదారు నిమిషాలాగి వక్కపొడి కొనుక్కుని దిగాము. కుడి బెంచీమీది ఇద్దరిలో ఒకరు పాంటువాలా, ఇంకొకాయన ధోతీ వాలా. లొల్లి చిలికి చిలికి గాలివాన అయినట్టుంది. గల్లాలు పట్టుకుని లాక్కుంటున్నారు. ఇద్దరి బెంచీ శివమెత్తినట్టు ఊగుతోంది. దానిమీదున్న ఖాళీ ప్లాస్టిక్ గ్లాసులు కింద పడిపోయినై. "పోరా బాడ్కావ్!

వట్టి బేకార్‌గానివి" ధోతీవాలా పళ్లు పలుగురాళ్లు నముల్తున్నట్టు పటపటలాడినై. పాంటువాలా చెంప ఛెళ్లుమంది. వెంటనే అతడు విజృంభించాడు.

"నీయవ్వ. పెండ్లాం సంపాదనతోని తాగి తందనాలాడ్తున్న నువ్వు నన్ను బేకార్‌గాడంటావా?" వారుణివాహిని ధారుణ ఛాయలు కళ్లల్లో కనబడుతూంటే ధోతీవాలాను వెనకనుండి తోసేశాడు. ధోతీవాలా బొక్కబోర్లాపడి "అమ్మో, అయ్యో" అని అరుస్తూ నేలమీద బొర్లుతున్నాడు. "చంపినవ్‌రా లం... కాలో, చెయ్యో విరిగినట్టుందిరా!" లబోదిబోమంటున్నాడు. లేవబోయి పడిపోయాడు. తోవలో వెల్తున్న వారెవరో పాంటువాలాను భుజాలమీద చేతులేని నెట్టుకెళ్లారు. బెంచీలమీదున్న వాళ్ళకదేమీ పట్టినట్టు లేదు. ముచ్చట్లాడుతూ, తాగుతూ వాళ్ల లోకంలో వాళ్లున్నారు. కొందరు సారా పాకెట్లు కొనుక్కొని చక్కా వెళ్లిపోతున్నారు. వాళ్లల్లోంచి ఒకాయన ధోతీవాలాను లేపబోయాడు. అతడు లేవలేదు. "పోశయ్య ఇయ్యాల్లగూడా ఓ పాకెట్ ఎక్కువ తాగినట్టుంది. పెండ్లాముకు చెప్తే వచ్చి లేపుకపోతుంది" అంటూ వెళ్లిపోయాడు.

మూన్నాల్లు నిమిషాల్లో ఒకావిడ పరుగెత్తుకొచ్చింది. ధోతీవాలాను వెల్లకిలా పడుకోబెట్టి దమ్మేదీస్తోంది. కొంగు నడుముకు బిగించుకుని "నీ తాగుట్ల మన్నువడ. నీకు గత్తరరాను. నీ బెల్టు షాపులు నాశనంగాను. రోజు గిదేనాయె. పిడికెడు మీసాలున్న మొగబాయిగాళ్లగ్గూడా సిగ్గూ శరం లేదాయె. లెవ్వవయ్యా!" కోపంగా అరుస్తూ లేపి నుంచో బెట్టింది. ఆ గొంతు ఎక్కడో విన్నట్టుంది. ముందుకెళ్లి ఆమె ముఖం చూశాను. ఓ క్షణం గుండె గుబగుబలాడింది. "అరె... ఈమె మణెమ్మ రవీ... రోజూ మాకు ఆకు కూరలమ్ముతుంది" ఇంకొంచెం ముందుకెళ్లాను. ఈలోగా మణెమ్మ భర్త చేతుల్ని తన భుజాలమీదేసుకుంది. అతడు ఊగిసలాడుతున్నాడు. "నువ్వా మణెమ్మా?" ముక్కుమీద వేలేసుకున్నాను. తలెత్తి నావైపు చూసి ఉలిక్కిపడింది.

"అవున్సారు! వీడే నా పెనిమిటి" కళ్లు మంచు పూలైనాయి. వీధి లైట్లు వెలుతుర్లో కన్నీటి పొర మెరుస్తోంది. "రోజు గిదే బాగోతమాయె. ఎక్కడంటే అక్కడ సారా పొట్లాలు దొరకవట్టె. నాశనగాలమొచ్చింది" కొంగుతో కళ్లద్దుకుంటూ భర్తను నడిపించుకెళ్లింది. నా మనసు వైరస్ సోకిన కంప్యూటర్లాగైంది. "ఇలాంటి వాళ్ళంతా ఓట్ల పంటకు విత్తనాలన్న మాటా!" అనగలిగాను. "ఇదంతా మనకెందుగాని పదండి సార్. పెళ్లి ముహూర్తం టైమైంది... అక్షింతలేసి భోంచేసి వెళ్దాం" రవీందర్ నన్ను లాక్కెళ్లాడు. అదంతా గుర్తుకొచ్చింది.... మనసును కలవరపెడ్తూనే ఉంది.

*(ఆంధ్రభూమి, శనివారం, 4-4-2009)*